# జాతీయ విద్యా విధానం 2020 - భాష మరియు సాహిత్యం ప్రాధాన్యత

డాక్టర్. ఢిల్లీశ్వరరావు సనపల,
తెలుగు అధ్యాపకులు,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పురుషులు), శ్రీకాకుళం.

## జాతీయ విద్యా విధానం ఉపోద్ఘాతం

"సంపూర్ణ మానవ సామర్థ్యాన్ని సాధించేందుకు నిష్పాక్షికమైన, న్యాయబద్ధ మైన సమాజాన్ని స్థా పించేందుకు జాతీయ అభివృద్ధి ని ముందుకు తీసుకెళ్లేందుకు విద్య మౌలికమైనది. భారత దేశ నిరంతర ప్రగ తికి అలాగే ఆర్థిక అభివృద్ధి, సామాజిక న్యాయం, సమానత్వం, వైజ్ఞానిక ఉన్నతి, జాతీయ సమైక్యత, సంస్కృతి పరిరక్షణ రిత్యా ప్రపంచ వేదిక మీద నాయకత్వం వహించేందుకుగాను, నాణ్యమైన విద్య అందరికీ అందుబాటులో ఉండేలా చూడటం చాలా ముఖ్యమైన అంశం. వ్యక్తి, సమాజ, దేశ, ప్రపంచ శ్రేయస్సు కోసం మన దేశ సుసంపన్న సామర్థ్యాలను, వనరులను అభివృద్ధి పరచుకుంటూ ముందుకు వెళ్లేందుకు విశ్వజనీన సర్వశ్రేష్ఠ విద్యే ఉత్తమైన మార్గం"(జాతీయ విద్యా విధానం 2020 పుట3) అని పేర్కొన్న మాటలను సునిశితంగా పరిశీలిస్తే జాతీయ విద్యా విధానం 2020 ద్వారా విద్యా ఆశయాలు, ఆవశ్యకత తెలియవస్తుంది. స్వాతంత్ర్యం అనంతరం మనదేశంలో మొదటి విద్యా విధానం 1968లో రూపొందించగా 1986లో నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకురావడం జరిగింది. 1992లో కొన్ని మార్పులు చేర్పులు చేసి దానిని కొనసాగిస్తూ వచ్చారు. ప్రొఫెసర్ యశ్ పాల్ కమిటీ ఇచ్చిన నివేదికల్లో పొందుపరిచిన భారరహిత విద్యా విధానంగా (నేషనల్ కరికులం ఫ్రేమ్ వర్క్ 2005) తయారు చేయడం జరిగింది. 2014 టీఎస్సార్ సుబ్రహ్మణ్యం కమిటీ, 2019 కస్తూరి రంగన్ కమిటీ నివేదికలను అనుసరించి నూతన జాతీయ విద్యా విధానం 2020 రూపకల్పన జరిగింది.

## జాతీయ విద్యా విధానం2020 ప్రాధాన్యతలు

"**ఆ నో భద్రాః క్రతవో యన్తు విశ్వతః||** అనేది వేదమంత్రం . అన్ని దిశల నుండి శ్రేష్ఠ మైన ఆలోచనలు నాకు రానివ్వండి అని అర్థం. పవిత్రమైనవి మంగళకరమైనవి గొప్ప వైనవి మనలో చేరాలి అని అర్థం కూడా. నూతన జాతీయ విద్యా విధానంలో పై మాటకు సరిగ్గా సరిపోయే విధంగా అనేకమైన, శ్రేష్ఠ మైన , సమకాలీన సమాజానికి అవసరమైన, విద్యా విషయాలను చేర్చడం గమనించవచ్చు. బహుశాస్త్ర విషయ ప్రధానంగా విద్య ఉండాలనేదే నూతన జాతీయ విద్యా విధానం యొక్క ప్రథమ లక్ష్యంగా తెలుస్తోంది. "ఉన్నత విద్యా నిర్మాణానికి బహుశాస్త్ర విషయ విశ్వవిద్యాలయాల స్థాపన, ఉన్నత విద్యాసంస్థల ఏర్పాటు దిశలో ముందుకు సాగాలనేది ఈ విద్యా విధానపు అత్యంత కీలకమైన విధానం".(పుట 48 జాతీయ విద్యా విధానం 2020) అందులో భాగంగానే శాస్త్ర సాంకేతిక విద్యా విషయాలతో పాటు గణితం, విజ్ఞాన శాస్త్రం, వృత్తిపర అంశాలకు సముచితమైన స్థానాన్ని కల్పించడం జరిగింది. ఈ విద్యా విధానంలో పర్యావరణం, వాతావరణ మార్పులు, కాలుష్యం, వ్యర్థాల యాజమాన్యం, పారిశుద్ధ్యం, జీవవైవిధ్య పరిరక్షణ, జీవావరణ యాజమాన్యం, అడవుల్లో వన్యప్రా ణుల పరిరక్షణ, నిలకడతో కూడిన ప్రగతి, జీవనం వంటి అంశాలను చేర్చడం జరిగింది. "విలువలు ఆధారిత విద్య మానవీయ, నైతిక, రాజ్యాంగపర, విశ్వ మానవ విలువలు, సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింస, శాస్త్రీయ స్పృహ, పౌరసత్వ విలువలు, జీవన నైపుణ్యాలు వంటివి మిళితం చేయడం జరిగింది.(పుట 52) సేవా పాటవాలు, సమాజ సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం, సమగ్ర విద్యతో అంతర్భాగంగా పరిగణించడం జరిగింది. ప్రపంచమంత రోజు రోజుకూ దగ్గరవుతున్నందువల్ల ఎదురయ్యే సమకాలీన ప్రపంచ సవాళ్లకు ప్రతిస్పందనగా విద్యార్థులు ప్రపంచ సమస్యలను అర్థం చేసుకునేందుకు, చైతన్యవంతులు అయ్యేందుకు, మరింత శాంతయుత, సహనశీల, సమ్మిళిత, భద్రమైన, నిలకడతో కూడిన, సమాజాల నిర్మాణంలో చురకైన భాగస్వాములుగా అయ్యేందుకు, ప్రపంచ పౌరసత్వ విద్య, గ్లోబల్ సిటి
న్షిప్ ఎడ్యుకేషన్ అందించడం ఈ విద్యా విధానం లక్ష్యం. వీటితో పాటుగా వ్యవసాయం, వాణిజ్యం, కళలు, హస్తకళలు మొదలైన అనే అంశాలకు

ప్రముఖ స్థానం కల్పించారు. అంతేకాకుండా ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి అంశాలకు పెద్ద పీట వేస్తూ ఈ విద్యా విధానపు రూపకల్పన జరిగింది అని చెప్పవచ్చు. ఒక సమగ్రమైన బహుశాస్త్ర విషయ విద్యను సాధించే క్రమంలో అన్ని ఉన్నత విద్యాసంస్థలు సరళమైన, వినూత్నమైన పాఠ్యప్రణాళికలో కమ్యూనిటీ ఎంగేజ్మెంట్, సేవ, విలువలు ఆధారిత విద్య వంటి వాటిలో యోగ్యతలపై ఆధారపడిన కోర్సులు ప్రాజెక్టులు ప్రవేశపెట్టడం ఈ విద్య విధాన లక్ష్యాలలో ఒకటిగా ఉంది. యోగ, క్రీడలు, హస్తకళలు మొదలైన అనేక అంశాలు కేంద్రీకృతం కావడంతో పాటు "ఆరోగ్యవంతమైన నైతిక విలువలతో పాటు తార్కికత, కార్యశీలత, కారుణ్యం, సహానుభూతి, ధైర్యం, లాఘవం, శాస్త్రీయ ఆలోచన, సృజనాత్మక శక్తి ఉన్న మంచి మనుషులుగా తీర్చిదిద్దడం, మన రాజ్యాంగం ప్రవచించిన సమానత్వం, సమ్మిళితత్వం, బహుత్వం ఉన్న సమాజ నిర్మాణానికి గాను ఉత్పాదకశీలుల్ని ఉత్తమ పౌరులను తయారు చేయడమే ఈ విధానం ధ్యేయం"(పుట5 జాతీయ విద్యా విధానం 2020) గా జాతీయ విద్యా విధానం సూత్రాలను ప్రకటించింది.

నూతన జాతీయ విద్యా విధానంలో భాగంగా "ఒక సమగ్ర బహుశాస్త్ర విషయ విద్య మానవుల్లోని అన్ని రకాల సామర్థ్యాలను అంటే మేధోపర, సామాజిక, భౌతిక, భావోద్వేగ, నైతిక సామర్థ్యాలను ఒక సంఘటిత పద్ధతిలో అభివృద్ధి పరుస్తుంది. అది వివిధ రంగాలకు చెందిన కళలు, మానవీయ శాస్త్రం, భాషలు, సాహిత్యం, సామాన్య శాస్త్రం, సామాజిక శాస్త్రం, వృత్తిపర, సాంకేతిక, ఒకేషనల్ విభాగాల 21వ శతాబ్దపు సంక్లిష్ట సామర్థ్యాలతో వ్యక్తుల సర్వతో ముఖాభివృద్ధి కి దోహదం చేస్తుంది".(పుట 51) పై విషయాలను పరిశీలించినప్పుడు విభిన్న సమకాలీన అవసరాలకు కావలసిన అనేక అంశాలతో పాటు భారతీయ భాషలు, సాహిత్యం, కళలు, సంస్కృతికి ఈ విద్య విధానంలో పెద్దపీట వేయడం జరిగిందని చెప్పవచ్చు.

నూతన జాతీయ విద్యా విధానంలో భాషలకు అనగా ప్రాంతీయ/మాతృభాషలకు ప్రముఖ స్థానం కల్పిస్తూ ప్రాథమిక విద్యతో పాటు ఉన్నత విద్యను కూడా ప్రా ంతీయ/మాతృభాషలోనే విద్యా బోధన జరగాలని విద్యా విధానంలో భాగంగా పేర్కొనడం జరిగింది. విద్యా బోధనలో భాషకు గల ప్రాధాన్యత, సాహిత్యం యొక్క అవసరం చెప్పకనే తెలుస్తోంది. ఈ నేపథ్యంలో భాష అంటే ఏమిటి? భాషా ప్రయోజనం ఏమిటి? మాతృభాషా బోధన ఆవశ్యకత ఏమిటి? ప్రాంతీయ/మాతృభాషలో విద్యాబోధన అవసరమా? సాహిత్యం ఎందుకు చదవాలి? సాహిత్యం ఒనగూర్చే ప్రయోజనం ఏమిటి? నూతన జాతీయ విద్యా విధానంలో భాష, సాహిత్యాలకు ఎందుకు ప్రముఖ స్థానం కల్పిస్తూ రూపకల్పన జరిగింది? అనే విషయాలు గురించి వివరణ ఈ వ్యాసం ప్రధాన ఉద్దేశం.

## భాషా నిర్వచనం

మనిషి తన సంపూర్ణ భావవ్యక్తీక రణకు ఉపయోగపడే సాధనం భాష. "ముఖ యంత్రం ద్వారా వెలువడే అర్థవంతమైన ధ్వనుల సముదాయం భాష"(తెలుగు భాషా వికాసం. పుట 3)అని భాషకి నిర్వచనం. భాష్యతే ఇతి భాష. భాషించేది భాష. భాష్ అనే ధాతువుకు మాట్లా డ్డం(to speak) అని అర్థం. "ఒక సాంఘిక సముదాయం సహకరించుకోవడానికి సాధనమైన స్వచ్ఛంద వాచక సంకేతాల వ్యవస్థ భాష" అని -**బ్లాక్ & ట్రేగర్,** చిత్తవృత్తిని వ్యక్తం చేసేందుకు చేసిన ఉద్దేశ్య పూర్వక ధ్వనుల ఉచ్చారణే భాష" అని - **మాంటీ** , "బుద్ధి జీవుల అనుభవాల అభివ్యక్తి భాష" అని - **ఇజ్లర్** పేర్కొన్నారు.

## భాషా ప్రయోజనం

భాష అనేది భావవ్యక్తీక రణ సాధనం.భాషనేది భావవ్యక్తీక రకు మాత్రమే కాకుండా నిత్య వ్యవహారంలో అవసరాలను తీర్చడానికి కూడా ఉపయోగపడుతుంది. భాష అనేది విజ్ఞా న సమూపార్జనకు, అభ్యసనానికి తోడ్పడుతుంది. భాష వ్యక్తి వికాసానికి జాతి అభివృద్ధికి దోహదం పడుతుంది. జాతి సంస్కృతిని సంప్రదాయాలను పరిరక్షించే ప్రధానవాహికలో ఒకటి భాష. విజ్ఞాన శాస్త్ర ప్రయోగ ఫలితాల నమోదుకు వాటిని తర్వాత తరాలకు అందించడానికి లిపి రూపంలో భాష సహాయపడుతుంది. ఉద్దీ పన ప్రయోజనాలు సాహిత్యం, ఇతర కళలు, అనుభూతి, సృజనాత్మక భావాలు మొదలైనటువంటి వాటికి ప్రధాన వాహిక భాష. ఒక జాతి సంప్రదాయాలు,

ఆచారాలు, అలవాట్లు, ఆహారం, వారసత్వ సంపద, గృహ నిర్మాణం, గృహోపకరణాలు వంటి అనేక అంశాలను భాష ప్రతిబింబిస్తుంది. భాష సుదీర్ఘ కాలం పాటు ఒక సమాజంలో జరిగే సామాజిక, సాంస్కృతిక, రాజకీయ, ఆర్థికపరమైన సంఘటనలకు సాక్షిగా నిలుస్తుంది భాష. ఒక సమాజం యొక్క మూలాలను గుర్తించడంలో భాష ప్రభావశీలంగా పనిజేస్తుంది. ఆంగ్లలో **ఎలక్స్ హెలీ(ALEX HALEY)** రాసిన **రూట్స్** (ROOTS) నవల భాషా ప్రా ధాన్యతను తెలియజేసే ఒక ఉదాహరణ. భాషలోని పద సంపద ఆ సమాజం సాంస్కృతిక పరిపుష్టికి దర్పనం లాంటిది. తెలుగు భాషలోని అనేక జాతీయాలు, నానుడులు, నుడికారాలు తెలుగువారి ఆచార వ్యవహారాలకు, వారసత్వ సంపదకు ప్రతీకగా నిలుస్తున్నాయి.

## మాతృభాష

"శిశువు మొట్టమొదట నేర్చుకునే భాషే మాతృభాష"(తెలుగు బోధనా పద్ధతులు పుట14). శిశువు పుట్టినప్పటినుంచి ఏ భాషా వాతావరణంలో పెరుగునో ఆ భాష అతనికి సహజంగా అలవడుతుంది. శిశువు తాను పుట్టినప్పటి నుండి తన తల్లిదండ్రులు మరియు ఇరుగుపొరుగు వారి నుండి ఏ భాషను వింటూ, ఏ ఇబ్బంది లేకుండా తన్మయత్వంగా నేర్చుకుంటూ ఉంటాడో, ఆ భాషను మాతృభాషగా పరిగణించవచ్చు. మనం మొట్ట మొదట నేర్చుకునేది, భావావేశ లేదా హృదయానుగత సంబంధం కలిగినది, లెక్కించడం, ఆలోచించడం, కలలు కనడం లాంటి వాటికి ఉపయోగించేది మాతృభాష(తెలుగు బోధన పద్ధతులు పుట15). అప్రయత్నంగా అభ్యసించి జీవితాంతం వెన్నంటూ ఉండే భాష మాతృభాష. వ్యక్తి తాను భాషను అభ్యసిస్తున్నాననే స్పృహ లేకుండా అలవర్చుకున్న భాష మాతృభాష (తెలుగు బోధన పద్ధతులు పుట15). భారతదేశంలో అనేక భాషలు ఉన్నాయి. అనేక రాష్ట్రాలు, ప్రాంతాలు ఉన్నాయి. ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క భాష మాట్లాడే వారున్నారు. ఏ ప్రాంతం వారికి ఆ ప్రాంతీయ భాష మాతృభాష అవుతుంది. ప్రాంతీయ భాషల పరిరక్షణ కోసమే యునెస్కో 2000 సంవత్సరం నుండి అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ప్రతి ఏటా ఫిబ్రవరి 21న జరుపుకునే విధంగా ఏర్పాటు చేసింది.

## మాతృభాష ప్రాధాన్యం & విద్యా బోధన

వ్యక్తిని పరిపూర్ణ మానవుడిగా ఉత్తమ పౌరుడిగా తీర్చిదిద్దేది మాతృభాష. మాతృభాష మీద తగినంత అధికారం ఉంటేనే ఏ వ్యక్తయి నా సమాజంలో ప్రతిభావంతుడుగా మనగలుగుతాడు. (తెలుగు బోధన పద్ధతులు పుట15) "పరభాషా మాధ్యమంలో విద్యాబోధన సోపానాలు లేని సౌధం లాంటిది" అని పేర్కొన్నారు - రవీంద్రనాథ్ ఠాగూర్. "నాగరిక జాతి మాతృభాషలోనే మాట్లాడుతుంది" అని పేర్కొన్నారు - డబ్ల్యూ.బి.ఈట్స్. "బహుళ భాషలో సమాజాల మనుగడ నేడు వాస్తవమైన మాతృభాష పరిరక్షణ". "నేను నా అభిమాన భాషలోనే మాట్లాడుతాను ఎందుకంటే నా ఉనికికి నా భాష కారణం కాబట్టి " అన్నారు **జనరల్ ఇరీనా బొకోవా** (యునెస్కో మాజీ డైరెక్టర్ జనరల్). "మా అభిమాన మాతృభాషనే మా బిడ్డలకు నేర్పుతాం. ఎందుకంటే వారు ఎవరో వారికి తెలియడం అవసరం గనుక" అని యునెస్కో నినాదం. ప్రపంచవ్యాప్తంగా విద్యావేత్తలు ఏ విజ్ఞా న శాస్త్రం నేర్చుకోవడానికైనా, పరాయిభాష నేర్చుకోవడానికైనా మాతృభాషా మాధ్యమమే సరైనదని చెబుతున్నారు. జ్ఞానార్జనకు మాతృభాష పునాది వంటిది అని అనేకమంది భాషా శాస్త్రవేత్తలు, మానవ శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. మాతృభాషలో విద్యాబోధన ద్వారా బట్టి పట్టే స్థితికి స్వస్తి పలికి అవగాహన విశృతి పెరుగుతుంది. మాతృభాషలో విద్యాబోధన ద్వారా పిల్లల అభ్యాసనాక్రమం మరింత విస్తృతి పరచడంలో తల్లిదండ్రుల భాగస్వామ్యం పెరుగుతుంది. సుప్రసిద్ధ అమెరికా భాషా శాస్త్రవేత్త **నోమ్ చామ్స్కీ** వాదన ప్రకారం విద్యార్థులకు 15 నుండి 20 సంవత్సరాలు వచ్చే వరకు మాతృభాషలో విద్యాబోధన జరపాలి. "వ్యక్తి ఏ భాషా జాతీయతకు, ఏ సాంస్కృతిక వరసత్వానికి ఏ ప్రాంతానికి చెందినవాడు అతని భాష చెబుతుంది. వ్యక్తుల అస్తిత్వం వారి మాతృభాష వలనే రుజువవుతుంది. మాతృభాషను పదిలపరచుకోవడం ద్వారా వ్యక్తి తన ఉనికిని తానే నిలుపుకుంటాడు. విద్యా బోధన మాతృభాషలోనే జరగాలి. కొల్లగొట్టుకునే సామ్రాజ్యవాదులకు సహాయకారిగా ఉండరాదు" అంటారు **మహాత్మా గాంధీ**. "మాతృభాషయందు విద్య గరుపుటయే మిక్కిలి సహజమైన మార్గము" అంటారు **డాక్టర్ సి.ఆర్ రెడ్డి**. జపాన్, ఐర్లాండ్, పోలాండ్, ఫిన్లాండ్, దక్షిణ కొరియా వంటి దేశాల్లో ప్రాథమిక విద్య మాతృభాషలోనే జరుగుతోంది. 1964-66 కొఠారి కమిషన్ కూడా మాతృభాషలో

విద్యాబోధన అవసరమని తెలియజెప్పింది. భారత రాజ్యాంగంలో అధికరణ '350ఎ' ప్రాథమిక స్థాయిలో మాతృభాష మాధ్యమంలో విద్యాబోధన గురించి తెలియజేస్తుంది.

## జాతీయ విద్యా విధానంలో భాషా స్థానం

"భాషకు కళతో సంస్కృతితో అవినాభావ సంబంధం ఉంటుంది. విభిన్న భాషలు ప్రపంచాన్ని విభిన్నంగా చూపిస్తాయి. అందువల్ల ఒక భాష నిర్మాణం దానిని మాట్లా డే స్థానిక వ్యక్తుల అనుభవ, అవగాహనను నిర్ధారిస్తుంది. ముఖ్యంగా ఒక సంస్కృతికి చెందిన వ్యక్తులు ఇతరులతో మాట్లాడే తీరును భాషలు ప్రభావితం చేస్తాయి"(జాతీయ విద్యా విధానం 22.4 పంక్తి. పుట 75) అని పేర్కొనడం గమనించదగిన విషయం. పిల్లల్లో అభివృద్ధి పరచాల్సిన ముఖ్య సామర్థ్యాల్లో సాంస్కృతిక చైతన్యం వ్యక్తీకరణ కూడా ఉంటుంది అని తెలియజేయడంలో వ్యక్తీకరణ భావవ్యక్తీకరణ అని చెప్పకనే చెబుతుంది. "సంస్కృతిని పరిరక్షించుకోవాలంటే, పెంపొందించుకోవాలంటే అనివార్యంగా ఆ సంస్కృతి తాలూకా భాషలను కూడా తప్పకుండా పరిరక్షించుకోవాలి, అభివృద్ధి పరుచుకోవాలి. (జాతీయ విద్యా విధానం పంక్తి 22.4. పుట 76) భాషలకు సంబంధించిన అనేక విషయాలను జాతీయ విద్యా విధానం 2020లో పేర్కోవడం జరిగింది. మాతృభాషల్లో బోధనతోపాటు భాషా పరిరక్షణ పదజాలం పరిపుష్టత నిఘంటు నిర్మాణం మొదలైన విషయాల పట్ల కూడా ఈ విద్యా విధానంలో ప్రస్తావించడం కనబడుతుంది. భాషా పరిరక్షణకు తీసుకోవలసిన చర్యలు, నేడు భారతీయ భాషల పరిస్థితి - దుస్థితి, అంతరించిపోతున్న అనేక భాషలు భాషతో పాటు కోల్పోతున్న విలువైన సంస్కృతి-సంపద మొదలైన విషయాలను జాతీయ విద్యా విధానం2020లో పొందుపరచడాన్ని గమనించవచ్చు. "దురదృష్టవశాత్తు భారతీయ భాషలు సరైన శ్రద్ధకు, సంరక్షణకు నోచుకోవడం లేదు. కేవలం 50 సంవత్సరాల కాలంలోనే 220కి పైగా భాషలను దేశం కోల్పోయింది. మరో 197 భాషలు ప్రమాదంలో ఉన్నాయని యునెస్కో ప్రకటించింది. ముఖ్యంగా లిపిలేని వివిధ భాషలు అంతరించిపోయే ప్రమాదం అంచున ఉన్నాయి. అలాంటి భాషను మాట్లాడే ఆదివాసి వృద్ధులు చనిపోయినప్పుడు చాలా సందర్భాల్లో వారు మాట్లాడే భాష కూడా వారితోనే కాలగర్భంలో కలిసిపోతుంది. ఎంతో గొప్ప భాషలని వాటి సాంస్కృతిక వ్యక్తీకరణ కాపాడేందుకు లేదా రికార్డు చేసేందుకు సరైన చర్యలు ప్రయత్నాలు జరగడం లేదు".(జాతీయ విద్యా విధానం పంక్తి 22.6. పుట 76)

దేశంలో భాషల పటిష్టతకు భాషాభివృద్ధి కి చేపట్టాల్సిన చర్యలతో పాటు భారతదేశంలో భాషలను శక్తివంతంగా సమగ్రత తో ఉండేలా దోహదపడే విధంగా నిఘంటువు నిర్మాణం ముద్రణ సామాగ్రి మొదలైన అంశాల్లో తగిన చర్యలు చేపట్టాల్సినటువంటి అవసరాన్ని కూడా తెలియజేస్తుంది. భాషతోపాటు భాషాభివృద్ధి ని చేసే ఉపాధ్యాయులు, అధ్యాపకులు కొరతను కూడా తెలియజేస్తూ "భారతదేశంలో నిపుణులైన భాషా ఉపాధ్యాయుల కొరత చాలా తీవ్రంగా ఉంది. భాషా బోధనను కూడా బాగా అభివృద్ధి పరచాలి. అది మరింత అనుభవపూర్వకంగా ఉండాలి. కేవలం సాహిత్య పదజాల వ్యక్తీకరణ పరమైన విషయాలే కాకుండా ఆ భాషల్లో సంభాషించగలిగేలా పరస్పరం వ్యవహరించగలిగేలా అభివృద్ధి పరచాలి. సంభాషణలకు బోధనకు, అభ్యాసానికి మన భాషలను తప్పనిసరిగా విస్తృతంగా వినియోగించాలి"(పంక్తి 22.7.పుట76) పాఠశాలల్లో చేరే వారి సంఖ్యను పెంపొందించేందుకు తీసుకోవలసిన చర్యల్లో భాగంగా బోధన మాతృభాష సంబంధ విషయాలను కూడా పేర్కొనడం జరిగింది. "విద్య అందుబాటు పాఠశాలల్లో చేరేవారి సంఖ్య (జిఇఆర్)పెరిగేందుకు మాతృభాషని వినియోగించాలి. అలాగే అన్ని భారతీయ భాషల పరిపుష్టిని వినియోగాన్ని, చేతనని పెంపొందించాలి". ప్రభుత్వ విద్యా సంస్థలే కాదు ప్రైవేటు విద్యాసంస్థల సైతం భాషా విషయంలో అతీతం కాదనే విషయాన్ని తెలియజేస్తూ " ప్రైవేటు ఉన్నత విద్యాసంస్థలు కూడా భారతీయ భాషలను బోధనా మాధ్యమంగా వినియోగించడాన్ని ద్విభాషా కార్యక్రమాలను నిర్వహించడాన్ని ప్రోత్సహించాలి. అందుకు ప్రోత్సాహకాలను అందించాలి". (పంక్తి 22.10. పుట77) "భాషల కోసం ఒక కొత్త సంస్థను నెలకొల్పాలనే ప్రతిపాదన కూడా చేసింది. పాళీ, పర్షియన్, ప్రాకృతం భాషలకు ఒక విశ్వవిద్యాలయం పరిధిలో జాతీయ సంస్థను నెలకొల్పడం జరుగుతుంది. శాస్త్రీయ భాషలు, ఆదివాసీ భాషలు, ప్రమాదం అంచున ఉన్న ఇతర భాషలతో సహా భారతీయ భాషలన్నింటినీ పరిరక్షించుకునేందుకు అభివృద్ధి పరచుకునేందుకు నూతన ఉత్సాహంతో చర్యలు తీసుకోబడతాయి"(పంక్తి 22.17. పుట79) అనే మాటలు భారతీయ భాషా పరిరక్షణకు, భాషాభివృద్ధి కి దోహదపడే అంశాలుగా చెప్పొచ్చు. అంతేకాకుండా మునుపెన్నడూ లేని విధంగా భాషకై ప్రత్యేక శ్రద్ధను కనపరుస్తూ

విద్యా విధానంలో భాషకు సముచిత స్థానం కల్పిస్తూ భాషకు గల ప్రాధాన్యత గుర్తించినట్టుగా భావించవచ్చు.

## సాహిత్యం

"హితేన సహితం సాహిత్యమ్" అనుటచే సాహిత్యం మేలుకూర్చునట్టి ది. ప్రీతి దాయకమైనది. నీతిని బోధించునది. ధర్మ ప్రతి పాదనము చేయునది.(తెలుగు సాహిత్య సమీక్ష పుట3) "సహితస్య భావః సాహిత్యమ్" సాహిత్యము ధర్మాది సకల శాస్త్ర రహస్యాలతో సహితమైనది. ప్రకృతి సత్యమును సౌందర్యవంతము చేసి ఆనంద పర్యవసానంగా చిత్రించినది సాహిత్యం.(తెలుగు సాహిత్య సమీక్ష పుట4) పై నిర్వచనాల ఆధారంగా సాహిత్యం హితాన్ని చేకూర్చడంతో పాటు ఆనందాన్ని కలిగిస్తుంది. అంతేకాకుండా సాహిత్యం సృజనాత్మకతను, సునిశిత పరిశీలనను, సౌమ్యతను, మృదుత్వాన్ని చేకూర్చుతుంది అని చెప్పొచ్చు. కావ్యము సర్వకాలికము,
సార్వజనీనమునయి అందరికీ అమృతప్రాయమైనట్టుది. ప్రకృతి సత్యమును సౌందర్యవంతం చేసి హృదయానంద పర్యవసాయిగా చిత్రించునది. విజ్ఞానమును, భావనాత్మక నివృత్తిని, చిత్తశుకమును కలిగించును. (తెలుగు సాహిత్య సమీక్ష పుట1) "సాహిత్యం సమాజాన్ని ఆశ్రయించి అనుగమించినా కొన్ని సందర్భాల్లో సాహిత్యం సమాజం యొక్క పురోగతికి చోదకమవుతుంది"అంటారు - ఆచార్య జి.ఎన్ రెడ్డి. పై నిర్వచనాలను పరిశీలిస్తే సాహిత్యం యొక్క విస్తృతి, పరమావధి, ఆవశ్యకత తెలుస్తోంది. అటువంటి గొప్పదైన సంపదను భారతీయ విద్యా విధానంలో పొందుపరిచే ప్రయత్నంలో భాగంగా జాతీయ విద్యా విధానం 2020లో సాహిత్యానికి సమషితమైన స్థానం కల్పించబడింది.

## జాతీయ విద్యా విధానం 2020లో సాహిత్యం ప్రాధాన్యత

" ఏ ఆకాశం కింద మానవమేధ తనలోని కొన్ని నిగూఢ శక్తుల్ని అద్భుతంగా వికసింప చేసింది? ఏ దేశం జీవితంలోని అతి గంభీరమైన సమస్యల గురించి క్షుణ్ణంగా ఆలోచించి మానవ జీవితాలను పరిపుష్టంగా, పరిపూర్ణంగా, విశ్వజనీనంగా చేసి ఇంకొక శాశ్వత జీవితాన్ని ప్రసాదించగల సాహిత్యం ఎక్కడుంది అని అడిగితే భారతదేశంలో అంటాను నేను" అంటారు **- మాక్స్ ముల్లర్** . అటువంటి గొప్పదైన సాహిత్య సంపదకు నిలయమైన దేశం భారతదేశం. క్రీస్తుకు పూర్వం నుండి ఉన్న అతికొద్ది ప్రాచీన సాహిత్యాలలో భారతీయ సాహిత్యానికి సమచిత స్థానం కలదు.
భారతీయ వేదవాఙ్మయం, ఉపనిషత్తులు, అరణ్యకాలు, బ్రాహ్మణాలు, పురాణాలు, ఇతిహాసాలు, కావ్యాలు,
నాటకాలు, కథలు విశ్వవిఖ్యాతి గాంచడంతోపాటు విశ్వవేదికలపైన సముచిత స్థానాన్ని పొందాయి. భారతీయ సాహిత్యంలో భారతదేశ విజ్ఞాన శాస్త్రం, ఖగోళ శాస్త్రం, కళలుతో పాటు భారతీయ సమాజం, సంస్కృతి, సంబంధ బాంధవ్యాలు, మానవీయత ప్రపంచానికి మార్గదర్శకమయ్యే సందర్భాలు అనేకం. లిపి కలిగిన భారతీయ భాషలన్నింటిలోనూ ఇంచుమించుగా సాహిత్యం వెలువడింది. విశిష్టమైన భారతీయ సంపదైన సాహిత్యాన్ని విద్యా విధానంలో మమేకం చేసి పొందుపరుస్తూ సమగ్ర బహుశాస్త్ర విషయ విద్యాబోధనలో భాగంగా సాహిత్య అధ్యయనం, సాహిత్య పరిశోధన, సాహిత్య అనువాదానికి సంబంధించిన అంశాలను ఈ జాతీయ విద్యా విధానంలో పొందుపరచబడింది. "కవులు ఎన్నుకోబడని శాసనకర్తల వంటివారు" అని అంటారు ఆంగ్ల కవి **షెల్లీ.**

విద్యలో సాహిత్యం అంతర్భాగం ఎందుకు కావాలో తెలియజేస్తూ "విద్యార్థుల లేత మనసులలో మాతృమూర్తిని ముద్రించి మాతృదేశ వీర కథానాయకములతో వారి రక్తనాలములను కదిలించినచో వారిలో స్వీయ భాషాభిమానం ఏర్పడి స్వీయ ప్రతిభ విస్మృతికి తావియదని నా విశ్వాసం" అంటా**[illegible]**వా. జాతీయ విద్యా విధానం2020లో "భారతీయ భాషల్లో తులనాత్మక సాహిత్యం, సృజనాత్మక రచనలు, కళలు, సంగీతం, తత్త్వశాస్త్రం మొదలైన వాటిలో దేశవ్యాప్తంగా పటిష్టమైన విభాగాలను, కార్యక్రమాలను నెలకొల్పి అభివృద్ధి పరచడం జరుగుతుంది."(పంక్తి 22.9. పుట77) పైన పేర్కొన్న అంశాలకు బలాన్ని చేకూర్చడంతో పాటు భారతీయ సాహిత్యాన్ని విద్యా విధానంలో పొందుపరుస్తూ బలోపేతం చేసే దిశగా అడుగులు వేసేవిగా ఉంది. "భారతదేశంలోని అన్ని భాషలలో వాటితో అనుబంధం ఉన్న కళలను సంస్కృతిని ఆధారిత వేదిక ద్వారా డాక్యుమెంట్ చేసి భద్రపరచడం జరుగుతుంది. సంభాషణలు, కథలు కవితా పఠనాలు, నాటక ప్రదర్శనలు, జానపద గేయాలు, నృత్యాలు మొదలైనవి అనేకం ఉంటాయి".(పంక్తి 22.19.పుట79) పై మాటలు లిఖిత సాహిత్యం మరియు మౌఖిక సాహిత్యం రెండింటినీ మరింత

సుస్థిరత పరచడంతో పాటు విస్తృతపరిచే విధంగా రూపకల్పన జరిగినట్టు తెలుస్తోంది.

## ముగింపు

జాతీయ విద్యా విధానం 2020లో భారతీయ భాషలకు ప్రముఖ స్థానం కల్పించడం జరిగింది. రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్ లో పొందుపరిచి, రాజ్యాంగం ఆమోదించిన 22 భాషలతో పాటు లిపి లేని వందలాది భాషల పరిరక్షణకు సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు జాతీయ విద్యా విధానంలో సముచిత స్థా నం కల్పించడం జరిగిందని పైన పేర్కొన్న అంశాల ద్వారా వెల్లడౌతుంది. ప్రాథమిక స్థాయి నుండి ఉన్నత విద్య వరకు ప్రాంతీయ/మాతృభాషలో విద్యా బోధనకు పెద్ద పీట వేస్తూ శాస్త్ర సాంకేతిక గ్రం థాలను, గణితం, భౌతిక శాస్త్ర గ్రం థాలను ప్రా ంతీయ/మాతృభాషల్లో అందుబాటులోకి తీసుకురావడానికి ఈ విద్య విధానం పెద్దపీట వేసింది. పరిశోధనకు విశ్వవిద్యాలయ స్థాయిలో ప్రముఖ స్థా నం కల్పిస్తూనే కళాశాలలను సైతం పరిశోధనలకు ప్రో త్సహిస్తూ భాషా సంస్కృతుల పరిరక్షణకు అధ్యయనానికి స్థానం కల్పించింది. భాషతోపాటు భారతీయ సాహిత్యానికి నూతన విద్యా విధానంలో సమచిత స్థానం కల్పించింది. ప్రపంచం మెచ్చదగిన అతి గొప్ప లిఖిత సాహిత్యం కలిగిన దేశం భారతదేశం. భారతీయ సాహిత్యం ప్రపంచానికి మార్గదర్శి అయింది. సాహిత్యం సృజన శక్తిని, సూక్ష్మదృష్టిని, సమతా స్థితిని, సున్నితత్వాన్ని, లౌకిక తత్వాన్ని ప్రేరేపిస్తున్న నేపథ్యంలో విద్యా విధానంలో సాహిత్యాన్ని కూడా విద్యార్థికి అందించే ప్రయత్నంలో భాగంగా నూతన విద్యా విధానం2020లో సాహిత్యానికి, సాహిత్య పరిశోధనకు సముచిత గుర్తింపునిస్తూ విద్యలో భాషా సాహిత్యాలను భాగం చేస్తూ విద్యార్థులను బహుశాస్త్ర విషయ అధ్యయనం దిశగా, భారతీయ విద్యను బలోపేతం చేస్తుంది.

### ఆధార గ్రంథాలు


1.జాతీయ విద్యా విధానం 2020 - విద్యా మంత్రిత్వ శాఖ భారత ప్రభుత్వం.

2.తెలుగు భాషా వికాసం - డాక్టర్.బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం.

3.తెలుగు భాషా చరిత్ర - భద్రిరాజు కృష్ణమూర్తి.

4.తెలుగు బోధన పద్ధతులు - తెలుగు అకాడమీ ప్రచురణ.

5.తెలుగు సాహిత్య సమీక్ష - ఆచార్య జి.నాగయ్య.